క్లుప్తంగా

విద్యాసామగ్రి పంపిణీ



సంగం : మండలంలోని దువ్వూరులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇన్ఫినిటీ ఫిన్‌కాప్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు విద్యాసామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. జెడ్పీ హైస్కూల్, అంగన్‌వాడీ పాఠశాల, ఎంపీపీఎస్ పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు రూ.1.50 లక్షల విలువైన టేబుల్స్, ఇతర విద్యాసామగ్రిని అందించారు. ఇందుకు సహకరించిన సంస్థ ఎండీ శ్రీకాంత్ రావల్కర్‌కు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ప్రసన్నకుమార్, సంస్థ నిర్వాహకులు మోహన్, సురేష్, విజయసారథి, శ్రీను, శ్రీకాంత్, వెంకటేష్ పాల్గొన్నారు.

నాణ్యత పరిశీలనకే కోర్ సేకరణ



సీతారామపురం : సిమెంట్ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పరిశీలనకే కోర్‌ను సేకరిస్తున్నట్లు పీఆర్ డీఈ మణికుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండగలో భాగంగా జాతీయ ఉపాధి హామీ నిధులతో నిర్మించిన కోర్ సేకరణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. సేకరించిన కోర్‌ను టెస్టింగ్ ల్యాబ్‌కు పంపి వచ్చే నివేదిక ఆధారంగా ఫైనల్ బిల్లులను మంజూరు చేస్తామన్నారు. ఆయనతో పాటు పీఆర్ ఏఈ తిరుమలయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, క్వాలిటీ కంట్రోల్ సభ్యులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



ఉదయగిరి(వింజమూరు) : మండలంలోని బుక్కాపురం గ్రామానికి చెందిన ఎన్నబత్తిన లక్ష్మి అనారోగ్య కారణంగా కుటుంబ సభ్యులు పెద్ద మొత్తంలో ఖర్చు చేసినప్పటికీ మృతిచెందింది. ఈ క్రమంలో మృతురాలి భర్త మస్తాన్ సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.9.90 లక్షలు మంజూరైంది. దీనిని మంగళవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తన కార్యాలయంలో మస్తాన్ అందజేశారు.

బీసీ వసతి గృహం పరిశీలన



వింజమూరు(ఉదయగిరి) : వింజమూరులోని బీసీ బాలుర వసతి గృహాన్ని కావలి ఏఎస్‌డబ్ల్యూ అధికారి వెంకటేష్ మంగళవారం పరిశీలించారు. వసతి గృహంలోని విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న పౌష్టికాహారం తదితర అంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా ఇదే వసతి గృహంలో చదివి ఇంటర్‌లో 962 మార్కులు సాధించిన బి.వెంకటసుశాంత్‌ను అభినందించారు. ఆయన వెంట వసతి గృహ సంక్షేమాధికారులు పి.వెంగళరావు, రియాజ్ ఉన్నారు.

శంఖవరంలో పోషణ్ పక్వాడా



వింజమూరు(ఉదయగిరి) : మండలంలోని శంఖవరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా పోషణ్ పక్వాడా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ షకీలా మాట్లాడుతూ పోషకాహార లోపానికి గురైన పిల్లల పట్ల ప్రత్యేక సంరక్షణ, ఆరోగ్యవంతమైన జీవనశైలి కల్పించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శైలజ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా

వరికుంటపాడు : ఇసుక లోడ్‌తో వేగంగా వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి ప్రమాదవశాత్తు బోల్తా పడిన ఘటన మంగళవారం వేకువజామున మండలంలోని జడదేవి సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. సంగం ఇసుక ర్యాంపు నుంచి ఇసుక లోడు చేసుకుని ప్రకాశం జిల్లా మార్కాపురానికి టిప్పర్ వెళ్తోంది. వేకువజామున జడదేవి గ్రామ సమీపంలోకి వచ్చేసరికి డ్రైవరు నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పి టిప్పర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు, జాతీయ రహదారి సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఇసుకను తొలగించి టిప్పర్‌ను లేపి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఉపాధి అవినీతి తారుమారు

- అక్రమాలను దాచేసిన ప్రిసైడింగ్ అధికారి
- ఆడిట్ బృందం గుర్తించిన అవినీతి రూ.1.26 కోట్లు
- అధికారులు తేల్చింది రూ.11.18 లక్షలు
- తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదిక సభను నిర్వహిస్తున్న అధికారులు

ఉదయగిరి/వరికుంటపాడు : వరికుంటపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం తూతూ మంత్రంగా సాగింది. డ్వామా పీడీ గంగాభవాని ప్రిసైడింగ్ అధికారిగా జరిగిన ప్రజావేదిక సభలో సోషల్ ఆడిట్ బృందం తేల్చిన అవినీతి లెక్కలను తారుమారు చేసి ఉపాధి అవినీతిని పూర్తిస్థాయిలో వెలికి తీయకుండా పాతర వేశారు. సోషల్ ఆడిట్ బృందాలు క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన, కూలీలతో విచారణ ప్రజాప్రతినిధులతో అభిప్రాయాలు తీసుకుంటూ పంచాయతీల గ్రామసభల్లో లెక్కతేల్చిన ఉపాధి అవినీతి రూ.1.26 కోట్లు. కానీ మంగళవారం జరిగిన సామాజిక ప్రజావేదికలో డ్వామా అధికారులు తెల్చిన అవినీతి రూ.11.18 లక్షలు. మండలంలో 24 గ్రామ పంచాయతీలకు సంబంధించి డ్వామా అధికారులు కేటాయించిన సమయం 3 గంటల 25 నిమిషాలు. ఇంతవరకు జరిగిన 15 విడతల ప్రజావేదికల్లో కనీసం పది గంటల సమయం పట్టేది. దీనిని బట్టి చూస్తే అధికారుల చిత్తశుద్ధి ఇట్టే అర్థమవుతుంది.

సిబ్బందిని మందలిస్తూ.. రికవరీని తగ్గిస్తూ

వరికుంటపాడు మండలంలో 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ 31 వరకు జరిగిన రూ.11.97 కోట్లు ఉపాధి పనులను సోషల్ ఆడిట్ బృందాలు వారం రోజుల పాటు క్షేత్ర పరిశీలన చేసి గత నెల 31వ తేదీన తమ నివేదకలు పూర్తి చేశారు. కానీ అనివార్య కారణాల రీత్యా అప్పుడే ప్రజావేదిక సభ జరగలేదు. డ్వామా పీడీ అధ్వర్యంలో మంగళవారం ప్రజావేదిక సమావేశం జరిగింది. క్షేత్రస్థాయిలో అనేక అక్రమాలు జరిగినట్లు ఎస్సార్పీ నీలకంఠ అధ్వర్యంలోని ఆడిట్ బృందాలు పంచాయతీల వారీగా తాము గుర్తించిన అవినీతి అక్రమాలు చదివి వినిపించారు. కానీ వీటిని పీడీ పరిగణనలోకి తీసుకోలేదు. పలుమార్లు ఉపాధి హామీ పథకం సిబ్బందిని మందలిస్తూ రికవరీని బాగా తగ్గించారు. ఆడిట్ బృందం గుర్తించిన అవినీతిలో పదిశాతం మాత్రమే రికవరీకి ఆదేశించారు.

కొన్ని కారణాల రీత్యా తక్కువ వేశా

సమావేశం వివరాలు వెల్లడించే సందర్భంగా పీడీ విలేకరులతో మాట్లాడుతూ వాస్తవంగా రూ.50 లక్షలకు పైగా రికవరీ వేయాలని, కానీ కేవలం కొన్ని కారణాల రీత్యా చాలా తక్కువ వేశాను అని తెలిపారు. తాము తేల్చిన రికవరీ రూ.11.18 లక్షలను సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేస్తామని తెలిపారు. ఇందులో ప్రమేయం ఉన్న టీఏలు శ్రీనివాసులు, మూర్తితో పాటు ఈసీ హజరత్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రావు, టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆవాజ్ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న ముస్లింలు

మర్రిపాడు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆవాజ్ కమిటీ అధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయడం ద్వారా ముస్లింలకు ఉన్న హక్కులను పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వం హరిస్తోందన్నారు. కేంద్రం దేశానికి మంచి చేయడం మరచిపోయి ముస్లింలను టార్గెట్ చేయడం తగదన్నారు. ప్రజలందరూ సంఘటితమై కేంద్రం చేస్తున్న చట్ట సవరణలు వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు.

డీసీపల్లిలో 427 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 427 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 554 బేళ్లు రాగా 427 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 54354.2 కిలోల పొగాకు విక్రయించగా రూ.14076553.80 వ్యాపారం జరిగింది. కిలో గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.230 కాగా, సగటున రూ.258.98 ధర లభించింది. వేలంలో 11 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంటలు



మర్రిపాడు : మాట్లాడుతున్న ఏఓ రామ్మోహన్



ఆత్మకూరు: చేజర్లలో మాట్లాడుతున్న ఏఓ

ఆత్మకూరు(చేజర్ల) : రైతులు ప్రకృతి వ్యవసాయంపై సంపూర్ణ అవగాహన కలిగి సాగు చేస్తే నాణ్యమైన పంట ఉత్పత్తులను పొందవచ్చని చేజర్ల మండల వ్యవసాయాధికారి వి.శశిధర్ అన్నారు. చేజర్ల వెలుగు కార్యాలయంలో ఏపీఎం సృజనతో కలిసి ప్రకృతి వ్యవసాయంపై సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. రైతులు, వెలుగు సిబ్బంది పాల్గొన్న సమావేశంలో ఏఓ శశిధర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో రైతులు వ్యవసాయం చేయాలని సూచించారు. గో ఆధారిత వ్యవసాయంతో ప్రకృతి వనమూలికల ద్వారా కషాయాలు తయారు చేసి పంటలపై పిచికారీ చేస్తే నాణ్యమైన దిగుబడులు వస్తాయని వివరించారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను గ్రీవెన్స్‌డే రోజున రెవెన్యూ కార్యాలయం వద్ద స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రజలకు వివరించాలని సూచించారు. ఏపీఎం సృజన మాట్లాడుతూ మహిళా సంఘం సభ్యులు కిచెన్ గార్డెన్స్‌ను ఇళ్ల వద్దనే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు కె.సుబ్బయ్య పలు మెళకువలను వివరించారు. వీఓఏలు, సీసీలు, వీఏఏలు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

మర్రిపాడు : స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సమావేశాన్ని మండల వ్యవసాయాధికారి ఎస్.రామ్మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించాలన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినగలమని సూచించారు. ఏపీఎం బుజ్జమ్మ మాట్లాడుతూ మహిళా సంఘాల్లో ఉండే పొలం కలిగిన రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని, భూమిలేని నిరుపేద కూలీలు ఇంటి వద్ద పెరటి తోటలు వేసుకోవాలని, ఆరోగ్యకరమైన కూరగాయలను పండించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ వీఏఏలు, గ్రామ సంఘాల వీఓఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరిలో మోస్తరు వర్షం

ఉదయగిరి : ఉదయగిరి పట్టణంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో అల్లాడిన జనానికి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో పాటు మోస్తరు వర్షం కురవడంతో కాస్త ఉపశమనం పొందారు. ఈదురుగాలులకు బస్టాండ్ సెంటర్‌లో ఫ్లెక్సీలు, టిఫిన్ బండ్లు నేలకొరిగాయి. సాయంత్రం చల్లని గాలితో ప్రజలు ఉపశమనం పొందారు.

కల్లు దుకాణానికి నిప్పు

- గుర్తుతెలియని వ్యక్తుల దుశ్చర్య

వరికుంటపాడు : మండలంలోని జడదేవి గ్రామ జాతీయ రహదారి సమీపంలోని కల్లు దుకాణానికి గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం తెల్లవారుజామున నిప్పు పెట్టడంతో కాలి బూడిదైంది. విషయం తెలుసుకున్న దుకాణ యజమాని పాలకూరి నాగయ్య ఘటనా స్థలానికి చేరుకున్నారు. గతంలో కూడా గుర్తుతెలియని వ్యక్తులు తగులబెట్టారని వాపోయారు. కల్లు దుకాణంలో బాకీ ఉందని అడిగినందుకే ఇలా చేసి ఉంటారని బాధితుడు తెలిపారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

మండల సమావేశం నేడు

కలిగిరి : కలిగిరిలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మెట్టుకూరు శిరీషారెడ్డి అధ్యక్షతన బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి మంగళవారం తెలిపారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

రెండు బైక్‌ల ఢీ

- ఇద్దరికి గాయాలు

వరికుంటపాడు : ప్రమాదవశాత్తు రెండు బైకులు ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన వరికుంటపాడు మండలం జడదేవి సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వరికుంటపాడు గ్రామానికి చెందిన కాంతయ్య, ప్రసాద్, శంకర్‌లు రెండు బైక్‌లపై దుత్తలూరు వైపు నుంచి పామూరు వైపు వెళ్తున్నారు. జడదేవి గ్రామ సమీపంలోకి వచ్చేసరికి పక్క పక్కనే వస్తున్న బైక్‌లు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కాంతయ్య, శంకర్‌లకు గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి 108కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం ప్రకాశం జిల్లా పామూరు వైద్యశాలకు తరలించారు.

టీడీపీ నేతలే పగటి వేషగాళ్లు

- గత ప్రభుత్వ హయాంలోనే కావలి అభివృద్ధి
- వాటిని తమ ఖాతాలో వేసుకునేందుకు టీడీపీ కుట్ర
- వైఎస్సార్‌సీపీ నేతల ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కావలి : కావలి నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల జాడ కనిపించడం లేదని, సీజన్‌కు తగినట్లు పగటి వేషగాళ్లు ఆ పార్టీని కమ్మేసి ప్రజలకు రోత పుట్టిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దేవ చేశారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో పార్టీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, మద్దిబోయిన వీరరఘు యాదవ్, గంధం ప్రసన్నాంజనేయులు, కనమర్లపూడి వెంకట నారాయణ, అక్కిలిగుంట మాల్యాద్రి, పరుసు మాల్యాద్రి తదితరులు మంగళవారం మాట్లాడారు. రామిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు లబ్ధిపొందిన వ్యక్తులు ఇప్పుడు టీడీపీలో పగటి వేషగాళ్లుగా ఉంటూ ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. పట్టణంలో రూ.కోట్లలో అభివృద్ధి పనులను జగన్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే రామిరెడ్డి మంజూరు చేయించారని, వాటిని ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం అరకొరగా కొనసాగిస్తూ, తామే అభివృద్ధి చేస్తున్నట్లుగా ప్రకటించుకోవడం హాస్యాస్పదమన్నారు. తుమ్మలపెంట రోడ్డు ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ కాంట్రాక్టర్ ప్రస్తుత ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అని, దాని నిర్మాణానికి వాడిన గ్రావెల్ ఆకాశం నుంచి తీసుకొచ్చారా, సముద్రం నుంచి తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు గ్రావెల్ తవ్వకాలు చేస్తే అభివృద్ధి కోసమని, వైఎస్సార్‌సీపీ నాయకులు చేస్తే గ్రావెల్ మాఫియా అంటూ వక్రభాష్యం పలకడంపై నిలదీశారు. గతంలో జర్నలిస్టుల కోసం ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి స్థలం కూడా కేటాయించారని, అంతేకాకుండా జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు కూడా ఇచ్చారని గుర్తుచేశారు. జర్నలిస్టుల విషయంలో రామిరెడ్డి ఎంతో ఉదారంగా ఉన్నారన్నారు. కావలిలో 126 ఎకరాలు ఆక్రమణలు గుర్తైనట్లు, అందుకు రామిరెడ్డి కారకులని ఆరోపణలు చేస్తున్న టీడీపీ నేతలకు దమ్ముంటే అవి ఎక్కడున్నయో తేల్చండని సవాలు విసిరారు. కావలి టీడీపీ అధ్యక్షుడు గుత్తికొండ కిశోర్‌బాబు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి చైర్మన్‌గా ఉంటే, జగన్ ప్రభుత్వం రాగానే ఆయన్ను తొలగించమని తాము కోరితే ఎమ్మెల్యేగా ఉన్న రామిరెడ్డి పదవీకాలం ముగిసే వరకు కొనసాగించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు కిశోర్‌బాబు ఆయన్ను దూషించడం ఏమిటని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌గా గెలిచి టీడీపీలోకి వెళ్లి మున్సిపల్ చైర్మన్ అయిన పోతుగంటి అలేఖ్య, పార్టీ మారకుండా వైఎస్సార్‌సీపీలోనే ఉన్న కౌన్సిలర్లను వెన్నుపోటుదారులుగా చెప్పడం ఎంత వరకు సబబు అని నిలదీశారు. ఆమె తండ్రి గ్రంధి యానాదిశెట్టితో సహా ఆర్యవైశ్యులు చర్చించుకొని పొట్టిశ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భావించామన్నారు. అయితే యానాదిశెట్టి అకాల మరణంతో ఆయన విగ్రహాన్ని ట్రంక్‌రోడ్డులో ఏర్పాటు చేయాలని, పలు ప్రదేశాలను పరిశీలించామని గుర్తుచేశారు. టీడీపీ ముసుగులో ఉన్న కొందరు వ్యక్తుల అరాచకాల వల్ల నియోజకవర్గ ప్రజల్లో రామిరెడ్డి మంచితనం గురించి చర్చించుకుంటున్నారని, దీనిని ఓర్వలేక ఆయనపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు తెలివైన వారు అని, టీడీపీ అరాచకాలను గమనిస్తున్నారని, సందర్భం వచ్చినప్పుడు తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో నాయకులు వాయిల తిరుపతి, కుందుర్తి కామయ్య, గుడ్లూరు మాల్యాద్రి, మేకల శ్రీనివాసులు, అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, గుర్రం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాగునీటి సంఘ నాయకులతో సమావేశం



మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసరావు

సోమశిల : అనంతసాగరం మండల పరిధిలోని సోమశిల ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సాగునీటి సంఘ నాయకులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. త్వరలో జరుగనున్న ఐఏబీ సమావేశాల్లో సమస్యలను తెలుసుకునేందుకు నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉత్తర కాలువ స్థితిగతులు, దెబ్బతిన్న ప్రదేశాలను గుర్తించి మా దృష్టికి తీసుకొస్తే ఐఏబీ సమావేశంలో ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. అదేవిధంగా కాలువల ద్వారా నీరు అందక ఇబ్బందులు పడుతున్న వారు కూడా సమస్యలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఉత్తరకాలువ సాగునీటి సంఘం అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దర్గా, ఈద్గాలను అభివృద్ధి చేయండి



నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

ఆత్మకూరు : పట్టణంలోని సుల్తాన్ షాహీద్ దర్గాతో పాటు శ్మశానవాటిక, ఈద్గా మైదానాన్ని అభివృద్ధి చేయాలని పలువురు ముస్లింలు ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు బీఎస్సార్ సెంటర్‌లోని దర్గా ఎదుట నిరసన తెలిపారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ వెంటనే పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దర్గా ఆవరణలోని శ్మశానవాటిక పరిసర ప్రాంతాలు పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లతో దుర్భరంగా తయారైందని, వెంటనే పరిశుభ్రం చేయించాలన్నారు. అదే క్రమంలో ఈద్గా మైదానాన్ని పూర్తిస్థాయిలో చదును చేయాలని కోరారు. కార్యక్రమంలో అన్ని వార్డులకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి ఘటనపై ముమ్మర దర్యాప్తు

ఆత్మకూరు : పట్టణంలో ఎల్ఆర్‌పల్లి మెయిన్‌రోడ్డు పక్కనే చెత్త కుప్పలో 2019 ఎన్నికలకు సంబంధించిన కవర్లు, స్టాంపులు పడి ఉండడంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, ముమ్మర దర్యాప్తు చేయాలని వారిని ఆదేశించినట్లు ఆత్మకూరు ఆర్డీఓ పావని తెలిపారు. ఆమె తన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపు ఉన్న రికార్డు రూము నుంచి ఎన్నికలకు సంబంధించిన కొంత సామగ్రిని ఎల్ఆర్‌పల్లి రోడ్డు వద్ద పడేసి ఉంటారని ఆమె తెలిపారు. 2019 ఎన్నికలకు సంబంధించిన కొంత సామగ్రిని కార్యాలయంలో భద్రపరిచినట్లు వివరించారు. కాగా ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం నేరానికి పాల్పడిన వారిని పట్టుకొని క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నాలుగు గంటలపాటు పనిచేయాలి



కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

వింజమూరు(ఉదయగిరి) : వింజమూరు పాతూరు చెరువులో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ గంగాభవాని మంగళవారం పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ప్రతిఒక్కరూ రోజుకు సుమారు నాలుగు గంటల పాటు పనిచేస్తేనే గరిష్టంగా రూ.300 కూలి వస్తుందన్నారు. కొలతల ప్రకారం పనులు చేసి గరిష్ట వేతనం పొందాలని సూచించారు. వేసవిలో కూలీలకు పనులు జరిగే చోట వసతులు కల్పించాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. కొలతల ప్రకారం పనులు చేయించాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిపై ఉందన్నారు. ఆమె వెంట ఏపీఓ సుభాషిణి, ఈసీ కృష్ణారావు, టీఏ మురళి, తదితరులు ఉన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



ఆత్మకూరురూరల్: దేపూరులో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన నిర్వాహకులు



సంగం : దువ్వూరులో..

ఆత్మకూరురూరల్ : మండలంలోని దేపూరులో పెంచలస్వామి, వెంకయ్యస్వామి ఆశ్రమాల వద్ద మంగళవారం మజ్జిగ, తాగునీటి చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆత్మకూరు–సోమశిల మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులకు వేసవి పూర్తయ్యే వరకు మజ్జిగ, తాగునీటిని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు భాస్కర్‌నాయుడు, పెంచలనాయుడు తెలిపారు. సర్పంచ్ రావిళ్ల వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ కర్ణం వెంకటసుబ్బయ్య, మాజీ సర్పంచ్ ఆదిశేషారెడ్డి, స్థానిక నాయకులు దొడ్ల సుమన్, తూమాటి తిరుపతి, కొల్లి తిరుపతి, ఆశ్రమ పూజారి నెల్లూరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

- సంగం : మండలంలోని దువ్వూరు గ్రామ బస్టాండ్ సెంటర్‌లో పంచాయతీ కార్యదర్శి హమీద్ మంగళవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేవారు. దీనిని ఎంపీడీఓ షాలెట్ స్థానిక టీడీపీ నాయకులు దయాకర్‌గౌడ్, మార్లెళ్ల శ్రీనివాసులు ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని వారు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



ఉదయగిరి : అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



ఆత్మకూరులో సూచనలు చేస్తున్న అధికారులు



మర్రిపాడు మండల కేంద్రంలో..

ఉదయగిరి : అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఫైర్ అధికారి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో సిబ్బంది, కార్మికులకు ఆయన మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయన్నారు. వీటి పట్ల అప్రమత్తంగా ఉంటే నివారించుకోవచ్చన్నారు. వంట చేసే సమయంలో గృహిణులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ

ఆత్మకూరు : ముందస్తు జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని ఆత్మకూరు ఫైర్‌స్టేషన్ అధికారి కె.శ్రీనివాసరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సినిమాహాల్స్, ఆర్టీసీ గ్యారేజీలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. సినిమాహాల్స్‌లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా టియర్ గ్యాస్ సిలిండర్లు ఏర్పాటు చేసి ఉంటారని, ప్రమాదాల సమయంలో వాటిని ఉపయోగించాల్సిన విధానం గురించి సిబ్బంది తెలుసుకుని ఉండాలన్నారు. సినిమాహాల్స్‌లో తొందరగా మంటలకు అంటుకునే పరికరాలు ఉంటాయని, అందుకే అలాంటి ప్రదేశాల్లో కచ్చితమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్యాస్ సిలిండర్ల ద్వారా జరిగే ప్రమాదాల గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది నరసయ్య, సుధాకర్, రవీంద్ర, ఎన్.ప్రభాకర్, రత్నం, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ సెంటర్‌లో..

మర్రిపాడు : మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రెండో రోజు అగ్నిమాపక వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖాధికారి వి.పెంచలయ్య ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో దుకాణదారులకు ప్రమాదాల నివారణపై కరపత్రాలను పంచుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.